క్లుప్తంగా...

ఓయూ కార్యక్రమాలకు మంత్రుల గైర్హాజరు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో జరిగిన వివిధ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసి ఇండో–పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంభానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన మహనీయుల జయంతి ఉత్సవాలకు హోంమంత్రి మహ్మద్ అలీతో పాటు మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతిరాథోడ్ హాజరుకావలసి ఉంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో పాటు పెంచిన డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఫీజుల పై విద్యార్థి సంఘాల ఆందోళన కారణంగా మంత్రుల సెక్యూరిటీ పై ఇంటలిజెంట్స్ వర్గాల అభ్యంతరంతో గైర్హాజరైనట్లు సమాచారం.

నేడు జాబ్‌డ్రైవ్

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ అయిన దిశ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వినోద్‌కుమార్, ఐవన్‌వాజ్, స్టీవెన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. బ్యాంకింగ్ రంగ ఉద్యోగాలల కోసం జరిగే ఇంటర్వ్యూలకు ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఆపై విద్యాభ్యాసం పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 94905 17219, 94946 98219 నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

బాలుడి మృతిపై లోతుగా విచారణ జరపాలి

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ అల్లావుద్దీన్ కోటిలో ఎనిమిదేళ్ల బాలుడు అబ్దుల్ వాహిద్ మృతిపై లోతైన విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన డిమాండ్ చేశారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలుడి మృతి తీవ్రంగా కలిచివేసిందని అన్నారు.

24 నుంచి టెక్నోస్మానియా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో ఈ నెల 24 నుంచి టెక్నోస్మానియా–2023 కార్యక్రమం ప్రారంభంకానున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు శుక్రవారం తెలిపారు. నిత్యం తరగతి చదువులు, సెమిస్టర్ పరీక్షలు, ప్రయోగాలతో బిజీగా గడిపే టెక్నాలజీ ఇంజినీరింగ్ విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి ప్రతి ఏటా నిర్వహించే టెక్నోస్మానియాకు ఈ ఏడాది కాలేజీ ఆవరణలో ఏర్పాటు పూర్తి చేసిన్నట్లు వివరించారు.మూడు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.


అమ్ముగూడ రోడ్డు


ప్రొటీనీ రోడ్డు


ఆల్బేయిన్ రోడ్డు

ఆ రోడ్లను తక్షణమే తెరవండి

- కంటోన్మెంట్ అధికారులకు రక్షణ శాఖ ఆదేశం
- ఇకపై ఆ ఐదు రోడ్లపైకి సామాన్య జనానికి అనుమతి

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్‌లో రోడ్ల మూసివేత అంశానికి తెరదించుతూ రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ప్రతిపాదిత రోడ్ల మూసివేతను విరమించుకోవాల్సిందిగా కంటోన్మెంట్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సికింద్రాబాద్ పరిధిలోని ఐదు రోడ్లపైకి ప్రజల వాహనాల రాకపోకలకు అనుగుణంగా తెరిచి ఉంచాలని సూచించింది. దేశ వ్యాప్తంగా 39 రోడ్ల మూసివేతకు సంబంధించి రక్షణ శాఖ ప్రత్యేక కమిటీని నియమించింది. వివిధ కంటోన్మెంట్‌ల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించిన కమిటీ 12 రోడ్లను తక్షణమే తెరవాల్సిందిగా, మరో ఏడు రోడ్లకు సంబంధించి యధాతథ స్థితిని కొనసాగించాలని సూచించింది. వీటిలో ఐదు రోడ్లు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోనివే కావడం గమనార్హం. రక్షణ శాఖ ఆదేశాలతో ప్రొటీనీ రోడ్డు, బ్యామ్ రోడ్డు, రిచర్డ్‌సన్ రోడ్డు (లక్డావాలా రోడ్డు), అమ్ముగూడ రోడ్డు, ఆల్‌బెయిన్ రోడ్లను తెరిచి ఉంచనున్నారు.


ఆల్బేన్ రోడ్డు

ఆ ఒక్క రోడ్డు మూసివేతకు ఓకే..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఆరు రోడ్లను మూసివేయనున్నట్లు బోర్డు అధికారులు ఆరు నెలల క్రితం నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. కొన్నేళ్లుగా అక్రమంగా మూసివేసి ఉన్న రోడ్లను మళ్లీ తాజాగా మూసేస్తున్నట్లు ప్రకటన ఇవ్వడం విడ్డూరంగా ఉందని పలువురు ఆక్షేపించారు. ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రక్షణ శాఖకు తమ అభ్యంతరాలు వెల్లడిస్తూ లేఖ రాసింది. కంటోన్మెంట్ బోర్డు తీర్మానం లేకుండా ఆయా రోడ్లను మూసివేయొద్దని కోరారు. ఈ మేరకు గతంలో రక్షణ శాఖ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో రోడ్ల మూసివేత అంశంపై వాడివేడి చర్చ సాగింది. రోడ్ల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. అయితే ఆయా రోడ్లను కొత్తగా మూసేయడం లేదని, యథాతథ స్థితిని మాత్రమే కొనసాగిస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ వాదించారు. దీంతో సీఈఓ మధుకర్ నాయక్ జోక్యం చేసుకుంటూ, రోడ్ల మూసివేత విషయంలో రక్షణ శాఖ నియమించిన కమిటీ సూచనల మేరకే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపాదిత ఆరు రోడ్లలో ఎంప్రెస్ రోడ్డు మూసివేతకు మాత్రమే అనుమతించిన రక్షణ శాఖ, మిగతా రోడ్లను తెరవాల్సిందేని సూచించింది.

అన్ని రోడ్లూ తెరవాల్సిందే : జితేంద్ర సురానా

ఆర్మీ అధికారులు మూసేసిన రోడ్లను తెరవాల్సిందిగా రక్షణ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను తాము స్వాగతిస్తున్నామని సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రకించారు. అయితే తాము మొత్తం 16 రోడ్ల విషయంలో కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నామని, ఆయా రోడ్లన్నింటినీ తెరవాల్సిందేనని డిమాండ్ చేశారు.

ఆ రెండు పార్టీలను తరిమికొట్టండి : మంత్రి మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కంటోన్మెంట్ గులాబీ అడ్డా : తలసాని

కంటోన్మెంట్: కంటోన్మెంట్ సమస్యలు తీర్చని కాంగ్రెస్, బీజేపీ నేతలను తరిమికొట్టాలంటూ మంత్రి మల్లారెడ్డి, కంటోన్మెంట్ గులాబీ అడ్డా అంటూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తమ ప్రసంగాలతో కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా ఇంచార్జ్ దాసోజు శ్రవణ్, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ తదితరులు హాజరయ్యారు. ముందుగా దివంగత ఎమ్మెల్యే సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో యాదాద్రి సహా హిందూ దేవాలయాలను అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌ను మించిన హిందువు లేడన్నారు. రాబోయే ఎన్నికల్లో స్థానిక కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి కంటోన్మెంట్ ఎమ్మెల్యేను 50 వేల మెజారిటీతో గెలిపించాలన్నారు.

2024లో మనదే అధికారం : మల్లారెడ్డి

అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ఉత్తమ పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్ నేతృత్వంలో 2024లో కేంద్రంలోనూ అధికారంలోకి వస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఇదిలా ఉండగా సోషల్ మీడియాలో తనదైన శైలిలో బీఆర్‌ఎస్ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తున్న క్రిశాంక్, ఆత్మీయ సమ్మేళనంలో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

సాయన్న వారసుల గైర్హాజరు

ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కంటోన్మెంట్ ఎమ్మెల్యే పదానికి పర్యాయపదంగా మారిన సాయన్న హఠాన్మరణం స్థానిక బీఆర్‌ఎస్ రాజకీయాలను కుదిపేస్తోంది. సాధారణ ఎన్నికలకు ఏడాది లోపే గడువు ఉండటంతో ఉప ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. దీంతో సాయన్న వారసులుగా రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేయాలని భావించిన ఆయన కుటుంబ సభ్యుల ఆశలకు గండిపడినట్లు అయింది. అయితే పార్టీలో సాయన్న వారసులగా ఆయన కుమార్తెలు లాస్య నందిత, నివేదితలకు తగిన ప్రాధాన్యమంటుందని మంత్రులు ప్రకటిస్తూ వచ్చారు. అయితే తాజా పరిణామలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆత్మీయ సమ్మేళనాల్లో సాయన్న వారసులకు ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. బొల్లారంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సాయన్న కుమార్తెలే ముందుండి నడిపించారు. గత వారం నాలుగో వార్డు వెస్ట్‌మారేడుపల్లిలో నిర్వహించిన సమావేశం నాటికి పరిస్థితిలో మార్పు వచ్చింది. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న కార్పొరేషన్ చైర్మన్‌లు క్రిశాంక్, గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ళ శ్రీనివాస్‌తో పాటు శ్రీగణేశ్‌లకు ప్రాధాన్యత పెరిగింది. ఇక సాయన్న నామస్మరణ, ఆయన చేసిన సేవలపై కూడా ముక్తసరిగానే మాట్లాడుతూ వక్తలు ప్రసంగాలు ముగించారు. సాయన్న వర్గానికి చెందిన ముఖ్య నేతలను సైతం సమావేశానికి ఆహ్వానించకపోవడంతో పలువురు నేతలు అసంతృప్తి వెళ్లగక్కారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బోయిన్‌పల్లిలో నిర్వహించిన సమావేశానికి సాయన్న కుమార్తెలు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న కారణంగానే వారు ఆత్మీయ సమ్మేళనానికి రాలేదని తెలుస్తోంది.

డ్రైవర్ సాధికారత పథకం దేవుడిచ్చిన గొప్పవరం

మంత్రి కొప్పుల ఈశ్వర్

సనత్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న డ్రైవర్ సాధికారత పథకం దేవుడిచ్చిన గొప్ప వరం లాంటిదని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 78 మంది లబ్ధిదారులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా కార్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ యువతకు అండగా నిలిచేలా ప్రభుత్వం డ్రైవర్ సాధికారత పథకాన్ని ప్రారంభించిందన్నారు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నారని చెప్పారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ క్రిస్టియన్లకు 60 శాతం సబ్సిడీతో కార్లను అందజేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రభుత్వంత ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 1831 మంది క్రైస్తవ మైనార్టీ లబ్దిదారులకు ఆర్థిక సబ్సిడీ కింద రూ.20 కోట్లు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ, శంకర్, విద్యా స్రవంతి, కిరణ్‌కుమార్, రైడన్‌రోస్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగం కాంట్రాక్టు అధ్యాపకులు కాదాసి సత్యనారాయణకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీఎస్ఈ విభాగం అధ్యాపకురాలు ప్రొ.సుజాత పర్యవేక్షణలో ఐడెంటిటీ బెస్ట్ ఎన్క్రిప్షన్ ఆఫ్ డేటా ఫ్రాగ్మెంట్స్ యూజింగ్ హైబ్రిడ్ ఆల్గోరిథం ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశం పై పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. కరీంనగర్ జిల్లా గంగాధర్ మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన తొలి గురువు, సోదరుడైన దివంగత కాదాసి వెంకట్‌కు తన డాక్టరేట్ డిగ్రీ అంకితం ఇస్తున్నట్లు సత్యనారాయణ పేర్కొన్నారు.

'గాంధీ' సూపరింటెండెంట్‌కు పలువురి అభినందన


గాంధీ సూపరింటెండెంట్ రాజారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్ఎంఓలు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రొఫెసర్ రాజారావును పలువురు వైద్యులు, ఆర్ఎంఓలు, సిబ్బంది అభినందించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అందరి సహాయసహకారాలతో నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని రాజారావు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహారావు నేత, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, లేడీఆర్ఎంఓ పద్మ, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు అన్నపూర్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలో రూ.13, నల్లవంకాయ రూ.18, పొడుగు వంకాయ రూ.18, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.45, బజ్జీమిర్చి రూ.40, క్యాప్సికమ్ రూ.45, పచ్చకాకర రూ. 42, పందిరి బీర రూ.45, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.21, దొండ రూ.14, గుండుబీన్స్ రూ. 65, గింజ చిక్కుడు రూ.55, కీర రూ.28, దోసకాయ రూ.23, బీట్‌రూట్ రూ.21, ఉల్లిగడ్డ రూ.10, ఆలుగడ్డ రూ.20, చామగడ్డ రూ.43, మొరంగడ్డ రూ.18, కందగడ్డ రూ. 53, సొరకాయ రూ.9, పొట్లకాయ రూ.15, ముల్లంగి 5–6.

క్రైం కార్నర్..

ఐపీఎల్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిపై కేసు

అడ్డగుట్ట: ఐపీఎల్ మ్యాచ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన మేరకు.. బంజారాహిల్స్‌కు చెందిన శ్రావణ్(33), మారేడుపల్లికి చెందిన విలియమ్స్(34), కృష్ణ(34)లు స్నేహితులు. ముగ్గురూ గురువారం రాత్రి అడ్డగుట్ట బస్టాండ్ వద్ద ఫోన్‌లో ఐపీఎల్ మ్యాచ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నారు. సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తుకారాంగేట్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ముగ్గురినీ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం, వారి వద్ద నుంచి రూ. 14,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 21న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెం. 7లో ఆగి ఉన్న రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ కోచ్‌లో సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో కూర్చొని ఉన్నాడు. గమనించిన రైల్వే పోలీసులు అతని వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


లక్ష్మయ్య

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. తార్నాకలోకి ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న లక్ష్మయ్య(43) ఈ నెల 16న సాయంత్రం సమయంలో కూరగాయలు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో లాలాగూడ – మౌలాలి రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన లక్ష్మయ్యను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు.

త్వరలో సీఎం టోర్నీ: సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్


ఓయూలో మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో పాఠశాల స్థాయి నుంచి క్రీడలకు ప్రాధాన్యతను కల్పిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ చైర్మన్ తెలంగాణ స్టేట్స్ (సాట్స్) చైర్మన్ డాక్టర్ ఈడిగ ఆంజనేయగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన అన్యువల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్–2023కు కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షత వహించగా సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులను క్రీడల పట్ల ఆకర్షితులను చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల క్రీడా ప్రాంగణాలు, స్టేడియాలను నిర్మించిన్నట్లు చెప్పారు. ఇంత వరకు క్రీడ రంగం పై సీఎం కేసీఆర్ రూ. 1200 కోట్లకు పైగ ఖర్చు చేసిన్నట్లు చెప్పారు. సాట్స్ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న సీఎం టోర్నీకి ఓయూ నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనలని విజ్ఞప్తి చేశారు. సాట్స్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఓయూకు విచ్చేసిన పూర్వవిద్యార్థి డాక్టర్ ఆంజనేయగౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

క్లాసిక్ గార్డెన్‌లో జైన్ సమాజ్ వర్షితప్ మహోత్సవ్


కార్యక్రమంలో పాల్గొన్న సదా కేశవరెడ్డి, జైన్ సమాజం ప్రముఖులు

రసూల్‌పురా: భగవాన్ ఆదినాథ్ జీ చైత్రమాసం తృతీయ రోజున భౌతిక కుటుంబ ఆనందాలను త్యజించి రోజు కావడంతో జైన్ సమాజం ముఖ్యమైన పండుగల పరిగణించి వర్షితప్ మహోత్సవ్ నిర్వహిస్తారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి అన్నారు. జైన్ సమాజం ఆధ్వర్యంలో కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో శుక్రవారం వర్షితప్ మహోత్సవ్ ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవ్ కార్యక్రమానికి సదా కేశవరెడ్డి, జైన్ సమాజ్ ప్రముఖులు హాజరయ్యారు.

ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ


భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణకు హాజరైన విద్యార్థులు

సనత్‌నగర్: విద్యతో పాటు ప్రతి విద్యార్థికి స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీలలో శిక్షణ ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని అమీర్‌పేట మండల ఉప విద్యాశాఖాధికారి కే యాదయ్య అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిస్సా పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యాదయ్య మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీల శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. సెయింట్ థెరిస్సా పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ సహజ వనరులను భవిష్యత్తు తరాలకు అందేవిధంగా నేటితరం జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా శిక్షణాధికారులు రామ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఇంటరాక్షన్‌తో ప్రజా సమస్యలు పరిష్కారం


ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : తెలంగాణ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యక్రమంతో ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. పలు విభాగాల అధికారులతో కలిసి భవానీనగర్‌లో శుక్రవారం ఆమె పర్యటించారు. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, సిటిజన్ గ్రీవెన్స్ డిస్పోజల్ కోసం మల్టీ డిసిప్లినరీ ఫీల్డ్ లెవల్ టీమ్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా భవానీనగర్‌లో పర్యటించి పలు ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని వివరించారు.

రెడ్ల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

రాంగోపాల్‌పేట్: ఈ నెల 23వ తేదీన కీసర కేబీఆర్ గార్డెన్స్‌లో జరుగనున్న మేడ్చల్ జిల్లా రెడ్ల ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున రెడ్లు తరలి రావాలని రెడ్డి ఐక్య కార్యాచరణ సమితి పిలుపునిచ్చింది. శుక్రవారం పార్క్‌లేన్‌లోని ఐక్య కార్యాచరణ కమిటీ కార్యాలయంలో ఐకాస సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశానికి చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి చర్చించారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటే లక్ష్యంగా ఐకేసీ ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఇంటికొకరు తరలి రావాలని సంఘం ప్రతినిధులు హరినాథ్‌రెడ్డి, రాఘవరెడ్డి, మధుకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు కోరారు.

అల్లా అనుగ్రహం అందరికీ ఉండాలి


మోతే శ్రీలత శోభన్‌రెడ్డి డిప్యూటీ మేయర్

లాలాపేట: అల్లా అనుగ్రహం ప్రజలందరిమీద ఉండాలనీ తద్వారా జీవితాన్ని సుఖవంతంగా గడపాలనీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలను ముగించుకుని ఈద్ ఉల్ ఫితర్ జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండా


బేగంపేట భగవంతాపూర్‌లో పర్యటించిన కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని ప్రాంతాల వారీగా పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి అన్నారు. భగవంతాపూర్‌లో అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆమె ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సీవరేజీ, వరద నీటి కాలువ సమస్యలను పలువురు ఆమె దృష్టికి తీసుకురాగా అధికారులు అంచనా రూపొందించాల్సిందిగా సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ రమేష్

బన్సీలాల్‌పేట్: శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బోయిగూడ రైల్వే బ్రిడ్జి సమీపంలోని శ్రీ సాయిబాబా దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన 15 సీసీ కెమెరాలను శుక్రవారం ప్రారంభించారు. ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్లు వై. నాగేశ్వర్‌రావు, ఎస్.ఐ కనకయ్య, సీఐ మోహన్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షులు పి. నర్సింగ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేష్, శ్రీకాంత్, కరుణాకర్(పాండు), ఓ. రాజు, క్రాంతి, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత విధానాలతోనే మనుగడ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ తప్పిదాలతో మనుగడ కోల్పోతున్న ధరిత్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్పీహెచ్ రంగయ్య పిలుపునిచ్చారు. సమస్త జీవరాశి ఆవాసమైన భూమి అనేక రకాల మానవ నిర్లక్ష్యాల కారణంగా ప్రమాదంలో పడుతుందన్నారు. తద్వారా మానవ సమాజం తీవ్ర ఇబ్బంది పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్–22 ధరిత్రి దినోత్సవం సందర్భంగా శుక్రవారం రంగయ్య బాగ్‌లింగంపల్లిలో మాట్లాడారు. ప్రభుత్వాలు, ప్రజలు మూడు సూత్రాల కార్యాచరణతో ధరిత్రిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం, సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగం ఆపడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కోసం ప్రతిజ్ఞ పూనాలని పిలుపునిచ్చారు.